ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 3
ఏప్రిల్ 2025



# మస్క్‌కు మళ్లీ దెబ్బ..

## తన పతనాన్ని తానే కోరి తెచ్చుకున్నడా..



ప్రపంచ బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇటీవల అనేక వ్యాఖ్యలు చేసి చర్చనీయాంశంగా మారిన మాస్క్ మామకు మరో షాక్ తగిలింది. టెస్లా, ప్రపంచంలో ప్రముఖ ఎలక్ట్రిక్ వాహన (%జుం%) తయారీదారుగా ఉన్నప్పటికీ, ఇటీవల కంపెనీ తన మొదటి త్రైమాసికంలో అనుకున్నదాని కంటే కనిష్ట అమ్మకాలను నమోదు చేసింది. 2025 ప్రారంభంలో, టెస్లా %జజూా% ఎలాన్ మస్క్‌కు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. దీంతో ఈ కంపెనీ అమ్మకాలు 13% తగ్గాయి. ఇది దాదాపు మూడు సంవత్సరాల్లోని అత్యంత బలహీనమైన ప్రదర్శన కావడం విశేషం. దీంతో టెస్లా కంపెనీ స్టాక్స్ 6 శాతం మేర పడిపోయాయి.

**కొత్త మోడల్స్**

తాజా అంచనాల ప్రకారం, జనవరి-మార్చి త్రైమాసికంలో టెస్లా తన అమ్మకాలలో 336,681 వాహనాలు మాత్రమే విక్రయించింది. ఇది 2024లో 386,810 యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే తగ్గింది. ఈసారి విశ్లేషకులు 372,410 వాహనాలు అమ్మే అవకాశం ఉందని అంచనా వేశారు. కానీ టెస్లా ప్రదర్శనలో రాణించలేదు. ఈ పతనం నేపథ్యంలో టెస్లా షేర్లు 2% తగ్గిపోయాయి. టెస్లా అమ్మకాల స్థాయిలు ఈ స్థాయిలో పడిపోవడం, టెస్లా పెట్టుబడిదారులను కలవర పెడుతోంది. 2025లో 20% - 30% అమ్మకాల వృద్ధిని సాధించాలనే టెస్లా లక్ష్యాలు కొత్త మోడల్స్ విడుదల చేయడమో లేదా ఇంకేదైనా చేస్తే గాని జరుగుతుందని చెప్పలేం.

**క్రమంగా తగ్గిన మార్కెట్..**

దీనికి ముందు టెస్లా బ్రాండ్ అగ్రగామిగా కొనసాగేది. కానీ ఎలోన్ మస్క్, రాజకీయ వ్యాఖ్యల వల్ల, అనేక మంది వినియోగదారులను ముఖ్యంగా యూరోప్, అమెరికా, చైనా వంటి ప్రధాన మార్కెట్లలో తనకు దూరం చేసుకున్నాడు. దీంతోపాటు మస్క్ రాజకీయ భావజాలంతో అమెరికాలో ఉద్యోగాల తొలగింపు వంటి వివాదాల్లో కూడా చిక్కుకున్నారు. ఈ కారణంగా టెస్లా వాహనాలపై వినియోగదారుల ఆదరణ క్రమంగా తగ్గింది. ఇందులో భాగంగా, యూరోప్, చైనా వంటి కీలక మార్కెట్లలో అమ్మకాలు అతి తక్కువగా నమోదయ్యాయి. మరోవైపు టెస్లా మార్కెట్‌కి ఎలక్ట్రిక్ వాహనాలు తయారు చేసే ఇతర సంస్థలతో పోటీ పెరగడం కూడా అమ్మకాల పతనానికి దారి తీసింది.

**అగ్రస్థానంలో మాత్రం..**

టెస్లా వాహన శ్రేణి తాజాగా రీఫ్రెష్ చేయబడలేదు. ఇది కూడా అమ్మకాలు తగ్గడానికి కారణమని నిపుణులు అంటున్నారు. చాలామంది వినియోగదారులు ప్రత్యర్థి సంస్థలు, ముఖ్యంగా చైనాలోని BYD వంటి సంస్థల కొత్త మోడళ్లను ఎంపిక చేసుకుంటున్నారు. BYD ఈ సంవత్సరం మొదటి సారి ప్రపంచ వ్యాప్తంగా టెస్లాను మించి, 15.7% మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో నిలిచింది. ఇది టెస్లా 15.3% కంటే ఎక్కువ కావడం విశేషం. ప్రతి ఎలక్ట్రిక్ వాహన కంపెనీ మార్కెట్ ట్రెండ్‌ను అనుసరిస్తూ, నిత్యం కొత్త మోడల్స్‌ను విడుదల చేస్తోంది. కానీ టెస్లా మాత్రం తన బ్రాండ్ పేరు, డిజైన్ ద్వారా ముందంజలో నిలిచింది. కానీ ప్రస్తుతం అప్డేట్ చేసే విషయంలో మాత్రం అంతరాయం కనిపిస్తోంది.




## ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా పూనమ్ గుప్తా

న్యూఢిల్లీ: ప్రముఖ ఆర్థికవేత్త పూనమ్ గుప్తాను ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా ప్రభుత్వం నియమించింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఇందుకు ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం ఆమె నేషనల్ కౌన్సిల్ ఫర్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్ల పాటు గుప్తాఈ పదవిలో ఉంటారు. జనవరిలో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైకేల్ డి పాత్రా పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో పూనమ్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. ఆర్థిక శాస్త్రంపై గట్టి పట్టు ఉన్న ఆమె ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుతో సహా పలు సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రధాని ఆర్థిక సలహా మండలిలోనూ ఆమె సభ్యురాలు.

## మార్చిలో తగ్గిన నియామకాలు




ముంబై: మార్చి నెలలో దేశంలో ఆఫీసు కొలువుల నియామకాలు స్వల్పంగా తగ్గాయి. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో ఈ నియామకాలు 1.4 శాతం తగ్గాయని నౌకరి.కామ్ తెలిపింది. హెూలీ, రంజాన్ పండగలు ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. గత ఏడాది మార్చితో పోలిస్తే గత నెల రిటైల్ రంగంలో 13 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో 10 శాతం, ఎడ్యుకేషన్ రంగంలో 14 శాతం నియామకాలు తగ్గాయి. గత ఏడాది మార్చిలో ఐటీ రంగంలో నియామకాలు 16 శాతం పెరగ్గా, గత నెల మూడు శాతం పడిపోయాయి.

## తయారీ రంగం దూకుడు

న్యూఢిల్లీ: మార్చి నెలలో తయారీ రంగం కనివిని ఎరుగని వేగంతో దూసుకుపోయింది. కొత్త ఆర్డర్లు పెరగడంతో పాటు అందుకు అనుగుణంగా వస్తూత్పత్తి కూడా పెరగడంతో తయారీ రంగ సూచీ హెచ్‌ఎస్‌బీసీ ఇండియా పీఎంఐ 58.1 పాయింట్లకు చేరింది. ఇది ఎనిమిది నెలల గరిష్ఠ స్థాయి. ఫిబ్రవరిలో ఇది 14 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో మార్చి నెల పీఎంఐ అద్భుతమైన రికవరీ సాధించిందని విశ్లేషకులంటున్నారు. అంతర్జాతీయ ఆర్డర్లు కొంతమేరకు తగ్గినా దేశీయ ఆర్డర్లు గణనీయంగా పెరిగాయని వారన్నారు. ఈ సూచీ 50 పాయింట్ల కన్నా పైన ఉంటే వృద్ధిపథంలో ఉన్నదని సంకేతం. గత జూలై తర్వాత మొత్తం విక్రయాలు ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం.

## సెన్సెక్స్ 593 పాయింట్లు అప్

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలను ప్రకటించనున్న నేపథ్యంలో క్రితం సెషన్‌లో భారీగా నష్టపోయిన ఈక్విటీ సూచీలు బుధవారం కాస్త కోలుకున్నాయి. బ్యాంకింగ్, వాహన, ఐటీ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు వేల్యూ బైయింగ్‌కు పాల్పడటంతో సెన్సెక్స్ 592.93 పాయింట్లు ఎగబాకి 76,617.44 వద్దకు చేరింది. నిఫ్టీ 166.65 పాయింట్ల లాభంతో 23,332.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి. బీఎసఈ మిడ్‌క్యాప్ సూచీ 1.38 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం పెరిగాయి.

**ఎన్ఎస్‌డీఎల్ ఐపీఓకు గడువు జూలై 31**

నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిరీ లిమిటెడ్(ఎన్ఎసడీఎల్) ఐపీఓను ప్రారంభించేందుకు గడువును సెబీ ఈ జూలై 31 వరకు పొడిగించింది. ఎన్ఎసడీఎల్ రూ.3,000 కోట్ల ఐపీఓకు మార్కెట్ నియంత్రణ మండలి 2024 సెప్టెంబరులోనే ఆమోదం తెలిపింది. డిపాజిటరీ ఐపీఓకు వచ్చేందుకు ఇదివరకున్న గడువు ఈనెల 11తో ముగియనుంది.







# యూపీఐ లావాదేవీల జోరు

## 2024 జూలై-డిసెంబరు మధ్య 4% వృద్ధి

న్యూఢిల్లీ: దేశంలో డిజిటల్ చెల్లింపులు జోరందుకున్నాయి. గత ఏడాది జూలై-డిసెంబరు మధ్య కాలంలో నమోదైన యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలే ఇందుకు ఉదాహరణ. ఈ కాలంలో దేశవ్యాప్తంగా 9,323 కోట్ల యూపీఐ లావాదేవీలు నమోదయ్యాయి. అంతకు ముందు ఆరు నెలలతో పోలిస్తే ఇది 42 ఎక్కువని వరల్డ్‌లైన్ సంస్థ తాజాగా విడుదల చేసిన తన 'ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ ఫర్ 2హెచ్, 2024'లో పేర్కొంది. లావాదేవీల సంఖ్య, లావాదేవీల విలువ పరంగా చూస్తే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎంలు 92-93 మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్నాయి. గత ఏడాది జూలై-డిసెంబరు మధ్య కాలంలో యూపీఐ చెల్లింపుల విలువ రూ.99.68 లక్షల కోట్ల నుంచి 31 వృద్ధితో రూ.130.19 లక్షల కోట్లకు చేరింది.

# లిథియం ఉత్పత్తిలోకి కోల్ ఇండియా

న్యూఢిల్లీ: బొగ్గు ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానంలో ఉన్న ప్రభుత్వ రంగంలోని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) కీలకమైన లిథియం ఖనిజ ఉత్పత్తిలోకి ప్రవేశించాలని యోచిస్తోంది. కంపెనీ సీఎండీ పీఎం ప్రసాద్ ఈ విషయం వెల్లడించారు. ఇందుకోసం ఇప్పటికే అర్జెంటీనా, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ ఖనిజ నిక్షేపాలున్న కొన్ని బ్లాకులను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. అరుదైన లిథియం ఖనిజాన్ని విద్యుత్ వాహనాల బ్యాటరీలు, పవన విద్యుత్ టర్బైన్స్‌లో పెద్ద ఎత్తున వినియోగిస్తారు. మన దేశంలో ఈ ఖనిజ నిక్షేపాలు పెద్దగా లేవు. దీంతో మన దేశానికి చెందిన అనేక కంపెనీలు ఈ నిక్షేపాలు అధికంగా ఉన్న అర్జెంటీనా, చిలీ, ఆస్ట్రేలియావైపు చూస్తున్నాయి.



# శాంసంగ్ ఏసీల్లో సరికొత్త టెక్నాలజీ..

## స్మార్ట్ థింగ్స్ కనెక్షన్ సహా అనేక సౌకర్యాలు..



టెక్ ప్రపంచంలో శాంసంగ్ గట్టి పోటీ ఇస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు తీసుకొస్తూ వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా శాంసంగ్ ఇండియా బెస్పోక్ AI విండ్‌ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లో ఒక వినూత్నమైన ఫీచర్‌ను ప్రారంభించింది. దీని పేరు "కస్టమైజ్డ్ కూలింగ్". ఇది కూలింగ్ విధానాన్ని సౌకర్యవంతంగా మార్చడానికి, నిద్రను మరింత సులభతరం చేసి, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు సహాయపడుతుంది. ఈ కొత్త ఫీచర్ SmartThings (స్మార్ట్ వాచ్ లాంటివి) ద్వారా పనిచేస్తుంది. దీంతోపాటు మాన్యువల్ సర్దుబాట్ల అవసరాన్ని కూడా తగ్గించి, స్థిరమైన ఉష్ణోగ్రతను అందిస్తుంది.

**ఏంటి ఈ కస్టమైజ్డ్ కూలింగ్ ఫీచర్?**

ప్రస్తుతం చాలా మంది ఇళ్లలో ACలు, ఫ్యాన్లను కలిపి ఉపయోగిస్తారు. దీనివల్ల మాన్యువల్ సర్దుబాట్లు చేయడం అవసరం పడుతుంది. అది నిద్రకు అంతరాయాన్ని కలిగిస్తుంది. దీంతోపాటు విద్యుత్ వినియోగాన్ని కూడా పెంచుతుంది. అంతేకాదు 50% మంది భారతీయ వినియోగదారులు రాత్రంతా తమ ACలను ఆన్, ఆఫ్ చేస్తూ నిద్రపోతుంటారు. ఇది కొన్నిసార్లు నిద్రకు ఇబ్బంది కలిగిస్తుంది. దీంతో ఈ ఫీచర్ ద్వారా సరైన ఉష్ణోగ్రతను కస్టమర్లకు అందించి సౌకర్యవంతమైన నిద్రను ప్రోత్సహిస్తుంది.

**ఇది ఎలా పని చేస్తుంది?**

ఈ కస్టమైజ్డ్ కూలింగ్ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్ హెూమ్‌లోని ఫ్యాన్లు, స్విచ్‌లు, ACలను ఒకే సమయంలో సమన్వయం చేసుకోవచ్చు. SmartThings ఆధారిత సాంకేతికతతో, ఏపీఐ, WWST-సర్టిఫైడ్ డివైస్లతో కనెక్ట్ చేసి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఇవి వినియోగదారులకు తమ గృహంలో ఎలాంటి మాన్యువల్ మార్పుల అవసరం లేకుండా స్థిరమైన ఉష్ణోగ్రతను అందించడంలో సహాయపడతాయి.

**విద్యుత్ పొదుపు**

ఈ ఫీచర్ విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు కూడా సహాయపడుతుంది. SmartThings ఎనర్జీ సర్వీస్ ద్వారా, వినియోగదారులు తమ విద్యుత్ వినియోగాన్ని పర్యవేక్షించి, ఇష్టానుసారం మార్చుకోవచ్చు. దీంతో విద్యుత్ బిల్లులలో సంపూర్ణ తగ్గుదల సాధ్యమవుతుంది. ఈ సరికొత్త AI ఆధారిత కస్టమైజ్డ్ కూలింగ్ ఫీచర్ Samsung 2025 బెస్పోక్ AI విండ్‌ఫ్రీ ACలలో అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఏసీలు ఎప్పుడు మార్కెట్లోకి వస్తాయనే విషయాలను మాత్రం అధికారికంగా ప్రకటించలేదు.

